క్లుప్తంగా

కృష్ణకిషోర్ మృతికి మంత్రి జోగి రమేష్ సంతాపం



కృత్తివెన్ను: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యాళ్ల కృష్ణకిషోర్ (60) మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. మండల పరిధిలోని గరిశపూడి గ్రామానికి చెందిన కృష్ణ కిషోర్ గురువారం ఉదయం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మంత్రి జోగి రమేష్ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళుల ర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

గుండుపాలెంలో పారిశుద్ధ్య పనులు

కోనేరుసెంటర్: గుండుపాలెం గ్రామంలో గురువారం పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కచ్చా డ్రెయిన్లు, ఊట బావుల వద్ద సున్నం, బ్లీచింగ్ చల్లారు. దోమలు వ్యాప్తి చెందకుండా దోమల మందును పిచికారీ చేశారు. మురుగునీరు పారుదల అయ్యేలా కచ్చా డ్రెయిన్లను తవ్వారు. కార్యక్రమాన్ని సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రాధా కృష్ణ పర్యవేక్షించారు.

కరకట్ట తవ్వకం వివాదానికి తెర

పొక్లెయిన్‌తో గుంత పూడ్చివేత

ఉత్తర చిరువోలులంక(మోపిదేవి): ఉత్తర చిరువోలులంకలో తవ్విన పాత కృష్ణా కరకట్ట గుంతను అదే రైతుచే పూడ్పించామని ఆర్‌సీ ఏఈ చిరంజీవులు గురువారం తెలిపారు. కరకట్ట అంచువరకు తవ్విన ఆ మట్టితోనే పొక్లెయిన్ సాయంతో యథావిధిగా పూడ్పించామని చెప్పారు. కరకట్ట ప్రదేశాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా జగనన్న సురక్ష శిబిరంలో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి వెంటనే పూడ్పించారన్నారు. ఎవరైనా కరకట్ట ప్రాంతాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాఠశాలలో చేరిన ఎస్టీ బాలికలు

మచిలీపట్నంటౌన్: 49వ డివిజన్ నారాయణపురం యానాదుల కాలనీకి చెందిన ఐదుగురు బాలికలను కార్పొరేటర్ పల్లి శేఖర్ గురువారం రుస్తుంబాద బాలికల మున్సిపల్ పాఠశాలలో చేర్పించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆధ్వర్యంలో ఇటీవల డివిజన్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ కాలనీకి చెందిన బాలికలు తమకు ధ్రువీకరణ పత్రాలు ఇప్పించి పాఠశాలలో చేర్పించాలని కిట్టును కోరారు. దీంతో వారికి కావలసిన ధ్రువీకరణ పత్రాలను ఇప్పించి ఐదుగురు బాలికలను పాఠశాలలో చేర్పించారు. బాలికలకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ప్రధానోపాధ్యాయుడిని కార్పొరేటర్ శేఖర్ కోరారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు వరం

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేదలకు వరంగా నిలుస్తోందని వైద్యాధికారి డాక్టర్ కేవీ జయరావు అన్నారు. చల్లపల్లి గ్రామ సచివాలయం-3 ప్రాంతంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. జగనన్న విలేజ్ క్లినిక్‌లో రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి సేవలు అందించారు. కార్యక్రమంలో పురిటిగడ్డ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ

మచిలీపట్నంటౌన్: వల్లేగూడెం అజ్మీర్‌బాబా సేవా సమాజం ఆధ్వర్యంలో గురువారం స్థానిక కాలేఖాన్ పేటలోని స్వాతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు కళ్ల కలక నివారణకు హోమియో మందులను ఉచితంగా పంపిణీ చేశారు. తొలుత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజం నిర్వాహకుడు సయ్యద్‌పీర్, హోమియో వైద్యుడు నేతి ప్రభాకర్, సమాజం సభ్యులు నాగేశ్వరరావు, సయ్యద్‌బాజీ, వసంతరావు, షేరాలీ, రంగారావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- విశ్వనాథపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



బ్రోచర్ అందజేసి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: పేదల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని విశ్వనాథపల్లి సచివాలయం పరిధిలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి రమేష్‌బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని 300 ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాలే పొందిన సంక్షేమ లబ్ధిని వివరించి, వాటికి సంబంధించిన బ్రోచర్లను అందించారు. ప్రజా సమస్యలను తెలుసుకుని అక్కడే సత్వర పరిష్కారం చూపేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రమేష్‌బాబు చెప్పారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటి ముంగిటకు పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ పనితీరుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమకు ఏ సమస్య ఉన్నా కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా వలంటీర్లే ఇంటికి వచ్చి తెలుసుకుని పరిష్కరిస్తున్నారని గ్రామస్తులు రమేష్‌బాబుకు వివరించి ఆనందం వ్యక్తంచేశారు. గత ప్రభుత్వ పాలనలో పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాసేవారమని, ఇప్పుడు వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్ నగదును ఇంటికి వచ్చి ఇస్తున్నారని పలువురు వృద్ధులు, దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేశారు. రహదారులు, డ్రెయినేజీలను అభివృద్ధి చేయడంతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని రమేష్‌బాబు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తోట నాంచారమ్మ, సీఈఓ చుండూరు రమేష్, సర్పంచి యలవర్తి నాంచారయ్య, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, వెన్నా ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కిడ్నీ డయాలసిస్ సెంటర్ ప్రారంభం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



డయాలసిస్ కేంద్రంలో పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్ పనులను గురువారం ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. ఈ కేంద్రం ఏర్పాటుతో నియోజకవర్గంలోని డయాలసిస్ రోగులకు వ్యయప్రయాసలు తగ్గి చికిత్స అందుబాటులోకి వస్తుందన్నారు. అడిగిన వెంటనే కిడ్నీ డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారని చెప్పారు. ప్రతి దానికి విమర్శలు చేయడం ప్రతిపక్ష నేత బుద్ధప్రసాద్‌కు అలవాటైపోయిందన్నారు. కరోనా సమయంలో అవనిగడ్డలో ఏర్పాటు చేసిన సెంటర్ ఈ ప్రాంతానికి చెందిన ఎందరికో ప్రాణ భిక్ష పెట్టిందని చెప్పారు. ఆనాడు కనీసం కన్నెత్తి కూడా చూడని ఆయన నేడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈనెల 9వ తేదీన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏరియా వైద్యశాలను సందర్శించిన ఆయన రోగుల వార్డును పరిశీలించి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ జయకుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, నాయకులు మద్ది చిన్నా, గాజుల జయగోపాల్, పలువురు నాయకులు, వైద్య, సిబ్బంది పాల్గొన్నారు.

లేగదూడల పోషణపై శ్రద్ధ పెట్టండి

పశుసంవర్ధక శాఖాధికారి దివాకర్



లేగదూడల అందాల పోటీల్లో ప్రథమ బహుమతి అందజేస్తున్న జేడీ దివాకర్, జెడ్పీటీసీ సురేష్

గూడూరు: లేగదూడల పోషణకు పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఎంఎస్‌ఏ దివాకర్ అన్నారు. గూడూరు మండలం కంచాకోడూరు గ్రామంలో గురువారం లేగదూడల అందాల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దివాకర్ మాట్లాడుతూ దూడల స్థాయి నుంచి గర్భం ఎదుగుతూ ఉంటుందన్నారు. వాటి పోషణ విషయంలో రైతులు పాటించాల్సిన మెలకువలను సూచించారు. గన్నవరం పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి కె.శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు సకాలంలో పశువులకు టీకాలు వేయించడంతో పాటు నట్టల నివారణ మందులు వాడాలని సూచించారు. పెయ్యి దూడల సంఖ్య పెంచడానికి ప్రభుత్వం సబ్సిడీ ద్వారా సెక్ సార్టెడ్ సెమన్‌ను వెటర్నరీ డిస్పెన్సరీలలో అందుబాటులో ఉంచిందన్నారు. 60 శాతం సబ్సిడీపై రైతులకు సమీకృత దాణాను సరఫరా చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులను కోరారు. గ్రామంలో ఏర్పాటు చేసిన లేగదూడల అందాల ప్రదర్శనకు 36 మంది రైతులు తమ లేగదూడలను తీసుకురాగా.. గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు ప్రదర్శనను ప్రారంభించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన లేగదూడల పోషకులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. సర్పంచి కోళ్ల హనుమంతరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పర్లం మహాలక్ష్మయ్య నాయుడు, ఆర్బీకే చైర్మన్ కోళ్ల శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ మచిలీపట్నం డివిజినల్ డీడీ రమణయ్య, పెడన ఏడీ కె. బాబూరావు, గూడూరు పశువైద్యాధికారి బి.విజయ్‌కుమార్, కంచాకోడూరు ఏహెచ్‌ఏ కేశవరావు, రైతులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో పొరపాట్లకు తావీయ వద్దు

పెడన మున్సిపల్ కమిషనర్ మహేంద్ర

పెడన: ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లకు తావీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్ర అన్నారు. గురువారం ఆయన తన చాంబర్‌లో పట్టణానికి చెందిన బీఎల్‌ఓలతో సమగ్ర ఓటరు సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాజకీయ నాయకులు, వలంటీర్ల ప్రమేయం లేకుండా బీఎల్‌ఓలు స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు ఉన్నదీ, లేనిదీ పరిశీలించి నిర్ధారణ చేసుకుని జాబితాలో ఉంచాలన్నారు. చనిపోయిన వారి వివరాలను, వారి ఆధారాలను సేకరించి అప్‌డేట్ చేసుకుని తొలగించాలని సూచించారు. కొత్త ఓటర్ల చేర్పింపు, చిరునామాల మార్పులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీఎల్‌ఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైస్ కార్డుల పంపిణీ



మచిలీపట్నంటౌన్: నగరంలోని 13, 18 డివిజన్లలో కొత్తగా మంజూరైన రైస్‌కార్డులను ఆయా డివిజన్ల కార్పొరేటర్లు గాజుల శ్రీదేవి, మేకల సుబ్బన్న గురువారం లబ్ధిదారులకు అందజేశారు. 13వ డివిజన్‌లో 12 మందికి, 18వ డివిజన్‌లో 9 మందికి కార్డులు మంజూరయ్యాయి. ఎన్నో ఏళ్లుగా రైస్‌కార్డులు లేక ఇబ్బంది పడుతున్న వారికి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వీటిని పంపిణీ చేయడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్డులను మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే పేర్ని నానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న సురక్ష విజయవంతం

మండలంలో 5,016 సర్టిఫికెట్ల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సలార్‌దాదా

మోపిదేవి: మండలంలోని 10 గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం అయిందని ఎంపీడీఓ రామలింగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జూలై 1 నుంచి 26వ తేదీ వరకు మండలంలో సురక్ష కార్యక్రమం నిర్వహించామన్నారు. పలు రకాల సర్టిఫికెట్లు 5,016 మంది లబ్ధిదారులకు అందజేశామని చెప్పారు. వీటిలో నాగాయితిప్ప గ్రామ సచివాలయం నుంచి 319, మెరకనపల్లి నుంచి 347, మోపిదేవి-1 నుంచి 188, మోపిదేవి-2 నుంచి 686, కె. కొత్తపాలెం నుంచి 432, కొక్కిలిగడ్డ నుంచి 208, పెదప్రోలు నుంచి 557, పెదకళ్లేపల్లి-1 నుంచి 543, పెదకళ్లేపల్లి-2 నుంచి 703, కోసూరువారిపాలెం నుంచి 151, ఉత్తర చిరువోలులంక నుంచి 412, వెంకటాపురం నుంచి 470 మందికి పలు రకాల సర్టిఫికెట్లు అందజేశామని వివరించారు.

నగర ప్రజలకు ఎంతో మేలు..

మచిలీపట్నంటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నగర ప్రజలకు ఎంతో మేలు జరిగిందని వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నగరంలోని 10,497 మందికి లబ్ధి చేకూరిందన్నారు. ముఖ్యంగా ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 4,013 మందికి, కుల ధ్రువీకరణ పత్రాలు 5,516 మందికి, ఆధార్‌తో సెల్ నంబర్ అనుసంధానం 833 మందికి ఉచితంగా చేయించామని వివరించారు. నగరంతోపాటు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగిందని వివరించారు. సమావేశంలో మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు గూడవల్లి నాగరాజు, శీలం బాబ్జీ, 33వ డివిజన్ కార్పొరేటర్ మీర్ అస్గర్‌అలీ పాల్గొన్నారు.

చెరువు తవ్వకం పనులకు శ్రీకారం

తీరనున్న పశువుల దాహార్తి సమస్య



చెరువు తవ్వేందుకు ముళ్ల పొదలను తొలగిస్తున్న పొక్లెయిన్

మచిలీపట్నంటౌన్: నగర పరిధిలోని బందరుకోటలో వేలాది పశువుల దాహార్తి తీరే మార్గం సుగమమైంది. 21వ డివిజన్ బందరుకోట ప్రజలు ఎన్నోఏళ్లుగా పశువుల పెంపకం ద్వారానే జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో దాదాపు 12 వేల గేదెలు, ఆవులను పెంచుతున్నారు. ఈ పశువులు మురుగు బోదెల్లో, శివగంగ ప్రధాన డ్రెయిన్‌లోని నీటిని తాగుతూ జీవిస్తున్నాయి. తమ జీవాలకు తాగునీటి వసతి కోసం చెరువు తవ్వించాలని బందరుకోట ప్రజలు గత పాలకులను అడుగుతూ వచ్చారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రత్యేక చొరవతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది. మూగ జీవాలకు తాగునీరు అందించే చెరువు తవ్వకానికి స్థలాన్ని కేటాయించారు. బందరుకోట శివారున ఉన్న గరాలదిబ్బ గ్రామ పరిధిలో 6.73 ఎకరాల భూమి కేటాయింపునకు ఎమ్మెల్యే పేర్ని నాని చర్యలు తీసుకున్నారు. 6 ఎకరాల భూమిని పశువుల తాగునీటి చెరువుకు, 73 సెంట్ల స్థలాన్ని హిందూ శ్మశాన వాటికకు కేటాయించారు. చెరువు తవ్వకం, శ్మశానం వాటిక పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా గురువారం ఈ స్థలంలో ఉన్న ముళ్ల పొదల తొలగింపు పనులను ప్రారంభించారు. ఈ పనులు పూర్తయ్యాక చెరువు తవ్వకం, శ్మశాన వాటిక పనులను చేపడతారు. ప్రస్తుతం ఈ పనుల ప్రారంభానికి ఎమ్మెల్యే పేర్ని నాని రూ.3 లక్షలు తన సొంత నిధుల వెచ్చించి పనులు ప్రారంభించారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

తీరనునన్న జీవాల బాధలు



ఎన్నో ఏళ్లుగా మా డివిజన్‌లో మూగ జీవాలు తాగునీటి సమస్యతో బాధపడుతున్నాయి. డ్రెయిన్లలో నీటిని తాగుతూ కాలం వెళ్లదీస్తున్నాయి. తరచూ వ్యాధుల బారిన పడుతున్నాయి. చెరువు తవ్వడంతో జీవాలకు తాగునీటి సమస్య తీరనుంది. ఈ ప్రాంత ప్రజలందరూ పశు పోషణపైనే ఆధారపడి జీవిస్తున్నారు. జీవాల తాగునీటి కోసం చెరువు తవ్వేందుకు ఎమ్మెల్యే పేర్ని నాని చేసిన కృషిని ఈ ప్రాంత ప్రజలు ఎన్నటికీ మర్చిపోరు.

– మన్నే శారద, 21వ డివిజన్ కార్పొరేటర్

విజయవాడ వెళ్లి పింఛను అందజేత



విజయవాడ ఆంధ్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీతకు పింఛను అందజేస్తున్న వలంటీరు సంధ్య

పెడన: మండల పరిధి నడుపూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు పరసా సీత తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ పది రోజుల నుంచి విజయవాడ ఆంధ్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గ్రామానికి చెందిన వలంటీరు గొాట్రు సంధ్య విజయవాడ ఆంధ్ర ఆస్పత్రికి వెళ్లి ఐసీయూలో చికిత్స పొందుతున్న సీతను కలిసి పింఛను సొమ్ము అందజేసింది. లబ్ధిదారు సీత ఆనందం వ్యక్తం చేసింది. ఇంత మంచి వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

నగరంలో 97.71 శాతం పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలో వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమం మూడో రోజు గురువారం కొనసాగింది. నగరంలో 18,360 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉండగా 17,940 మందికి అందజేసి మూడు రోజుల్లోనే 97.71 శాతం సాధించారు. ఇంకా 420 మందికి పింఛన్లు అందజేస్తే నూరు శాతం పంపిణీ పూర్తవుతుంది. పింఛన్ల పంపిణీలో నగరం జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచింది.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలి



గూడూరు: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు శ్రద్ధ చూపాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధులతో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గూడూరు మండలంలోని చాలా ప్రాంతాల్లో పంట దెబ్బతిందని చెప్పారు. మంత్రి జోగి రమేష్ ప్రత్యేక చొరవ తీసుకుని వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి రైతులు మళ్లీ ఆకుమడులు పోసుకునేందుకు 80 శాతం రాయితీపై విత్తనాలు అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ విషయాన్ని వీఏఏలు, వలంటీర్ల ద్వారా రైతులకు చేరవేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా వ్యవసాయ శాఖాధికారులు చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపీపీలు నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పర్లం మహాలక్ష్మయ్య నాయుడు, ఎస్‌ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, ఎంపీడీఓ డి.సుబ్బారావు, తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



బంటుమిల్లి: గర్భిణులు ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మ నివ్వాలంటే బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీఓ జె. స్వర్ణభారతి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లి, పిల్ల ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వమే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు అందచేస్తోందన్నారు. సీడీపీఓ ఎం. సముద్రవేణి తల్లిపాల ప్రాముఖ్యత, పౌష్టికాహార అవసరాన్ని వివరించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. సర్పంచ్‌లు బి. రమేష్, బి. చంద్రశేఖర్, ఎంపీటీసీ ఎండీ. కమాల్‌బాషా, డి. సుధారాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం. రాజబాబు, సచివాలయ మండల కన్వీనర్ సుబ్బారావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పెడన: అంగన్‌వాడీల ద్వారా బాలింతలు, గర్భిణులకు అందించే పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని పలువురు అన్నారు. గురువారం స్థానిక ఒకటో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని బాలింతలు, గర్భిణులకు పోషక విలువలు గల ఆహార పదార్థాలను అందజేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సిబ్బందితో పాటు మహిళా పోలీస్ తల్లిపాల విశిష్టతను వారికి వివరించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ చందన, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విషం తాగిన యువకుడు మృతి

పెడన: మండల పరిధిలోని జింజేరు గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జింజేరు గ్రామానికి చెందిన జక్కుల రాజ్‌కుమార్ (19) పెట్రోల్‌బంకులో పనిచేస్తుంటాడు. ఈ నెల ఒకటో తేదీన తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా.. తమ్ముడు బయట ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న రాజ్‌కుమార్ విషం తీసుకున్నాడు. తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి రాజ్‌కుమార్ అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. పక్కనే విషం సీసా ఉంది. వెంటనే ఆయనను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు. అక్కడి అవుట్ పోస్టు పోలీసులకు తండ్రి రామకృష్ణ ఫిర్యాదు చేశారు. వారి సమాచారం మేరకు పెడన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

మోపిదేవి: ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ సీహెచ్ పద్మ తెలిపిన వివరాల ప్రకారం.. అర్జా రామబుజ్జి స్థానికంగా తోపుడుబండిపై చిరు వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం ఆయన ప్రధాన సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రామబుజ్జి తలకు రోడ్డు దెబ్బ తగిలింది. బాధితుడిని 108 వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యుల సూచనల మేరకు విజయవాడకు తరలించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): మచిలీపట్నం ఎంపీ బాలశౌరి నిధులు రూ. 3.25 లక్షలతో ఉత్తర చిరువోలులంక గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ చింతా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. 54 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు.

రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం

పెడన: పెడనలో రెండున్నర కిలోల గంజాయిని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెడన పట్టణానికి చెందిన ఇమ్మానియేల్ నుంచి గంజాయిని మరో ఇద్దరు కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇమ్మానియేల్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.